
సాక్షి
అనంతపురం

సోమవారం । 15 । జనవరి । 2024



నేడు 'స్పందన' రద్దు

సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించినందున కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన'ను రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవి తెలిపారు.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాటా గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.5°/ 15.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నెట్టికంటుడి సన్నిధిలో ఘనంగా హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పుష్యమాసం సందర్భంగా ఆదివారం హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ యాగశాలలో హోమం కొనసాగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పందేలపై ప్రత్యేక నిఘా



అనంతపురం క్రైం: జిల్లాలో కోడి పందేలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఆదివారం పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సంప్రదాయ ఆటలు ఆడాలి కానీ జీవితాలు నాశనం చేసే జూదాలు ఆడరాదన్నారు. కష్టపడకుండా వచ్చే డబ్బు కోసం ఆరాటపడటం తప్పని చెప్పారు. జిల్లాలో కోడి పందేలు, పేకాట, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా వేశామన్నారు. పోలీసు నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగను మంచి వాతావరణంలో, సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, జూదం ఆడితే తన నంబర్ 9440796800 లేదా డయల్ 100, 112, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం తెలియజేయాలన్నారు.

రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్ల పట్టివేత



సిగరెట్ల బండిళ్లను చూపుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనిత, ఉద్యోగులు

అనంతపురం సిటీ: అక్రమంగా రవాణా చేస్తున్న రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్లను జీఎస్టీ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెంట్రల్ జీఎస్టీ అనంతపురం డివిజన్ సహాయ కమిషనర్ జి.అనిత వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకూ హైదరాబాద్-బెంగళూరు మార్గంలోని 44వ జాతీయ రహదారిపై అనంతపురం తపోవనం సర్కిల్ వద్ద జీఎస్టీ సూపరింటెండెంట్లు రంగనాయకులు, నాగానంద, రాహుల్, ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ, హెడ్ హవాల్దార్ ప్రభుదాస్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆదివారం వేకువజామున అటుగా వచ్చిన ఆర్‌జే11 జీబీ 9560 నంబర్ గల లారీని ఆపి పరిశీలించడంతో అందులో భారీ సంఖ్యలో సిగరెట్ల బండిళ్లు బయటపడ్డాయి. వీటికి సంబంధించి ఎలాంటి రికార్డులు, బిల్లులు లేవు. గోల్డ్ స్టెప్ ఫిల్టర్, ప్యారిస్ వంటి బ్రాండ్లకు చెందిన సిగరెట్లుగా గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.2.35 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. విచారణలో పాట్నా నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి, సిగరెట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై లోతైన విచారణ చేపట్టినట్లు జీఎస్టీ ఏసీ అనిత తెలిపారు.

సంతల ద్వారా రూ.4.30 లక్షల ఆదాయం



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో 4.30 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,54,070 వసూలు కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,76,800 మేర మార్కెటింగ్ ఫీజు వసూలైనట్లు వెల్లడించారు.

సంక్రాంతి సంబరం

- సంతోషంగా భోగి మంటలు
- ఆకట్టుకున్న ముత్యాల ముగ్గులు
- ప్రతిబింబించిన తెలుగు సంస్కృతి



గుంతకల్లు వాసవీమాత ఆలయ సమీపంలో వేసిన భోగిమంట



రాప్తాడులో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: ఆకుపచ్చని మామిడి తోరణాలు, పసుపు పచ్చని మేలిమి సింగారంతో మెరిసే గడపలు.. ముంగిట్లో ముగ్గులు, అందమైన గొబ్బెమ్మలు.. ఇంటికి తరలి వచ్చిన ధాన్యరాశులతో సంక్రాంతి పండుగ తెలుగింటి సంస్కృతిని ప్రతిబింబించింది. మూడురోజుల వేడుకలో తొలిరోజు ఆదివారం భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగ జిల్లా అంతటా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా తెల్లవారుజామునే అందరూ లేచి ఇళ్ల ముందు సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. అందులో పాత చీపుర్లు, తట్టలు, విరిగిపోయిన బల్లలు తదితర పాత వస్తువులను మంటల్లో వేసి శరీరాన్ని వెచ్చబరచుకున్నారు. చెడు కర్మలు తొలగించి పుణ్యగతులు సిద్ధింపచేయాలని అగ్నిదేవుని సాక్షిగా వేడుకున్నారు. ముత్తయిదువులు చిన్నారులపై భోగి పండ్లు (రేగి పండ్లు, బంతిపూలు, చామంతి, గులాబీ, రూపాయి నాణేలు) వేయించి ఆశీర్వదించారు. పాల పొంగులు పొంగిస్తూ తీపి పదార్థాలతో సంతోషాలు పంచుకున్నారు. సోమవారం సరదాల సంక్రాంతి, మంగళవారం కమ్మని విందుతో కనుమను ఆస్వాదించనున్నారు. కోడిపందేలు, ఎడ్లపందేలు తదితర సంప్రదాయ ఆటల పోటీలతో సంతోషంగా గడపనున్నారు.





అనంతపురంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దు, హరిదాసుల సందడి

నేడు మకర పూజలు..

మకర సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం అనంతపురంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా సాగిన తిరుప్పావై, ధనుర్మాస పూజల ముగింపు ఉత్సవాలు వేడుకగా సాగనున్నాయి. ముఖ్యంగా అయ్యప్ప మకర జ్యోతి సందర్భంగా హరిహరసుతుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలందుకోవడానికి అయ్యప్పను శోభాయమానంగా అలంకరిస్తున్నారు.

చెంతకే సంక్షేమం

- పేదలకు కూడు, గూడు కల్పన ప్రభుత్వ ధ్యేయం
- ప్రతి నెలా 6.69 లక్షల కార్డులకు 10 వేల టన్నుల బియ్యం పంపిణీ
- 655 లే- అవుట్‌లలో 99,920 మంది పేదలకు పక్కా గృహాలు

అనంతపురం అర్బన్: పేదలు కోరుకునేది కడుపు నిండా తిండి.. ఉండేందుకు సొంత ఇల్లు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా కూడు.. గూడు సమకూర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అర్హులైన వారికి బియ్యం కార్డును ప్రభుత్వం మంజూరు చేస్తోంది. పోషకాలతో కూడిన నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా ఇస్తోంది. ఇక అర్హులకు నివాస స్థలం కేటాయించడంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తోంది.

20 లక్షల మందికి బియ్యం..

జిల్లా వ్యాప్తంగా 1,641 చౌక దుకాణాల పరిధిలో 6,69,612 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుల్లో 20,54,800 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా 10,155 టన్నుల నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రతి సభ్యునికీ 5 కిలోల బియ్యం అందుతోంది.

జగనన్న కాలనీల్లో 99,920 ప్లాట్లు..

ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు ప్లాట్లు కేటాయిస్తూ పక్కా గృహం నిర్మించి ఇస్తోంది. జిల్లావ్యాప్తంగా 655 జగనన్న లే అవుట్లలో 99,920 ప్లాట్లు ఏర్పాటు చేసి పేదలకు పంపిణీ చేశారు. వీరందరికీ పక్కా గృహాలను మంజూరు చేశారు. అంతే కాకుండా 90 రోజుల్లో ఇంటి పట్టా పథకం కింద ఇంటి స్థలం కేటాయించేందుకు జిల్లాలో అర్హులైన 25,943 మంది గుర్తించారు. ఇందులో 6,482 మందికి ఇంటి స్థలం కేటాయించారు. మిగిలిన 19,361 మందికి ఇంటి స్థలం ఇచ్చేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది.



అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి జగనన్న కాలనీలో ఇళ్లు



అనంతపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

సొంతింటి కల సాకారం



నేను ఒంటరి మహిళను. నాకు సొంత ఇల్లు లేదు. ప్రభుత్వం నాకు ఇంటి స్థలం కేటాయించడంతో పాటు పక్కా గృహం మంజూరు చేసింది. ఇంటిని నిర్మించుకుంటున్నా. మాలాంటి పేదలకు సొంతింటి కల సాకారం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బి.నాగమ్మ, గొంచిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

35 కిలోలు బియ్యం ఇస్తున్నారు



మాది చాలా పేద కుటుంబం. అంత్యోదయ అన్నయోజన కింద ప్రతినెలా మాకు 35 కిలోల నాణ్యమైన బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. ప్రభుత్వం మాలాంటి పేదలకు బియ్యాన్ని ఉచితంగా ఇస్తూ ఎంతో మేలు చేస్తోంది.

– లక్ష్మీదేవి, వెంకటంపల్లి, కంబదూరు మండలం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం ప్రతి నెలా ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 6.69 లక్షల కార్డులకు ప్రతినెలా 10 వేల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నాం. ఇక అర్హత ఉన్న వారందరికీ ఇంటి స్థలం కేటాయిచడంతోపాటు పక్కా గృహాలు మంజూరు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 655 లే అవుట్లలో 99,920 మందికి ప్లాట్లు కేటాయించాం. వీటి ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వలంటీర్లు

అనంతపురం కల్చరల్: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నగరంలో నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. 'రోడ్డు భద్రతను అందరం పాటిద్దాం.. ఇతరుల భద్రతను బాధ్యతగా స్వీకరిద్దాం' అంటూ నినదించారు. రోడ్డు భద్రతను కాపాడుతున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్, కార్యదర్శి కీర్తి రాజేశ్వరి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి తుకారాం గణేష్ తదితరులు మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాల్లో సీటు బెల్టులు విధిగా పెట్టుకోవాలని తద్వారా ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, మైనర్లకు, లైసెన్సు లేని వారికి వాహనాలు ఇవ్వరాదని సూచించారు. జాగ్రత్త లేకుంటే రోడ్డు ప్రమాదం ద్వారా జరిగే ప్రాణ నష్టాన్ని ఊహించలేమన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సభ్యులు సాయి, వెంకటేష్, రూబీ తదితరులు పాల్గొన్నారు.

నాసిన్ కీర్తి.. సీమకే ఖ్యాతి



పాలసముద్రం సమీపంలో నాసిన్ అకాడమీ



అకాడమీ ఆవరణలో విమానం

- టీడీపీ హయాంలో శంకుస్థాపనలకే పరిమితం
- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో పనులు పరుగులు
- రూ. 749 కోట్ల విడుదల
- ఈ నెల 16న అకాడమీని సందర్శించనున్న ప్రధాని

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటవుతున్న నాసిన్ (నేషనల్ అకాడమీ అఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్) ఉమ్మడి అనంతపురం జిల్లాకే కాకుండా రాయలసీమకే తలమానికంగా కీర్తి పొందుతోంది. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించి, నిధులు రాబట్టడంలో సఫలం కావడంతో కేంద్ర పనులు శరవేగంగా సాగాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు.

ప్రచార ఆర్భాటానికే బాబు పరిమితం

2014 రాష్ట్ర పునర్విభజన చట్టంలో కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను నెలకొల్పనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.పాలసముద్రం సమీపంలో 502 ఎకరాల్లో నాసిన్ సంస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2014లో ఒకసారి, 2015 ఏప్రిల్ 15న మరోసారి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులతో శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత మిన్నకుండి పోయారు. 2015 నుంచి 2019 వరకు నాసిన్ సంస్థ కోసం సేకరించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు జరిగింది లేదు.

పనులు పరుగులు పెట్టించిన సీఎం జగన్

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విభజన హామీలు సత్వరం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలోనే 2022 మార్చి 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాల సీతారామన్ పాలసముద్రం సమీపంలో నాసిన్ సంస్థ ఏర్పాటుకు సేకరించిన భూముల్లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రూ. 749 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. పనులు ప్రాంభమైనప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నాసిన్ పనుల పురోగతిపై అధికారులతో అనేక సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు పరుగులు పెట్టాయి. ఈ క్రమంలోనే ఈ నెల 16న భారత ప్రధాని నరేంద్రమోదీ నాసిన్‌ను సందర్శిస్తున్నారు. 74,75 వ బ్యాచ్‌ల ఆఫీసర్ ట్రైనీలతో ముఖాముఖిలో పాల్గొంటారు.

పాలసముద్రానికి ప్రత్యేక గుర్తింపు...

నాసిన్ సంస్థ ఏర్పాటుతో పాలసముద్రం గ్రామం దేశంలోనే కాకుండా ప్రపంచ పటంలోనే ప్రత్యేక గుర్తింపు సంతరించుకోనుంది. ముస్సోరీ, హైదరా బాద్‌లో ఐఏఎస్, ఐపీఎస్‌లకు శిక్షణ ఇచ్చినట్లుగానే, పాలసముద్రం నాసిన్‌లో ఐఆర్ఎస్ పోస్టులకు ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారు. అలాగే, దక్షిణాసియా దేశాలకు చెందిన ఐఆర్ఎస్ అధికారులు కూడా ఇక్కడ శిక్షణ పొందనున్నారు.

లేపాక్షిని సందర్శించనున్న ప్రధాని మోదీ



లేపాక్షిలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

లేపాక్షి: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16న లేపాక్షి ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కూడా రానున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ లేపాక్షిలో పర్యటించారు. నంది విగ్రహం సమీపంలో 3 హెలిప్యాడ్‌ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వీరభద్ర స్వామి ఆలయాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఏపీ టూరిజం కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశమై, దిశా నిర్దేశం చేశారు.

వైభవంగా గోదాదేవీ పరిణయోత్సవం





వేంకటేశ్వరస్వామి, గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

తాడిపత్రి అర్బన్: ధనుర్మాస ముగింపును పురస్కరించుకుని ఆదివారం వేంకటేశ్వరస్వామి-గోదాదేవిల పరిణయోత్సవం వైభవంగా జరిగింది. తాడిపత్రిలోని చింతల వేంకటరమణస్వామి ఆలయంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భోగి పండుగ రోజున శ్రీవారి వక్షస్థల లక్ష్మిని గోదాదేవిగా భావించి ఆలయంలో ఏకాంతంగా పరిణయోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రాత్రి 7 గంటలకు వేద పండితుల సమక్షంలో పరిణయోత్సవం నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పండ్లు, కానుకలు, ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను స్వామివార్లకు సమర్పించారు. రాత్రి 9గంటలకు ఆలయ ప్రాకారోత్సవం జరిగింది. పల్లకీలో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పరేడ్‌కు యోగా శిక్షకురాలు


కృష్ణవేణి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రెండో రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకురాలుగా పని చేస్తున్న కె.కృష్ణవేణికి అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 26న న్యూఢిల్లీ వేదికగా జరిగే గణతంత్ర వేడుకల్లో జరిగే పరేడ్‌కు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఆయుష్ విభాగం తరఫున పరేడ్‌లో యోగాసనాలను ఆమె ప్రదర్శించనున్నారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లో ఉన్న హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో విశేష సేవలు అందించినందుకు ఆమెకు అరుదైన ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పలువురు యోగాభ్యాసకులు ఆమెను అభినందించారు.

చిన్న మొత్తాల పొదుపు సంఘం నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా చిన్న మొత్తాల పొదుపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ధర్మవరంలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా చలపతి, ఉపాధ్యక్షులుగా ఫణిరాజ్, వెంకటేష్‌శెట్టి, నాగభూషణం, ప్రభాకర్‌గుప్తతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


ఎద్దుల బండిపై వస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్


దప్పు కొడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి


ముగ్గుల పోటీల్లో భాగంగా వేసిన రంగవల్లులు

అంబరాన్నంటిన సంబరం

- పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకగా సంక్రాంతి సంబరాలు
- హోదాలు మరిచి సందడి చేసిన అధికారులు


భోగి మంటలు వెలిగిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్


చెక్కభజనలో కళాకారులు

అనంతపురం క్రైం: గ్రామీణ సంస్కృతికి దర్పణం పట్టేలా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎడ్లబండ్లు, సంప్రదాయ దుస్తులు, పలకల కోలన్న, కర్రసాము, గోలీల ఆటలతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సందడి చేశారు. హోదాలు మరిచి సంబరాల్లో పాల్గొన్నారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. భోగి మంటలు వెలిగించి గాలిపటాలు ఎగుర వేసి హరిదాసు ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం గ్రామీణ క్రీడలతో సందడి చేశారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజు కర్రసాము, గంగిరెద్దుల విన్యాసాలు, చెక్క భజన కళాకారుల విన్యాసాలు, పోలీసు కుటుంబసభ్యుల చిన్నారుల భరత నాట్యం, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. పోలీసు కుటుంబ సభ్యులు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎహనుమంతు, డీఎస్పీలు గంగయ్య, ప్రసాదరెడ్డి, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు రెడ్డప్ప, శివరాముడు, ప్రతాపరెడ్డి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర సభ్యులు సూర్యకుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, సరోజ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




కర్రసాము ప్రదర్శిస్తున్న ఏఆర్ డీఎస్పీ మునిరాజు


చిల్లాకట్టె ఆడుతున్న ఎస్పీ అన్బురాజన్


చేతిలో బొంగరాన్ని తిప్పుతున్న తాడిపత్రి డీఎస్పీ గంగయ్య


చిన్నారితో బొంగరానికి జాటీ చుట్టిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

సీపీఐ (ఎంఎల్) నేత పెద్దన్న మృతి


పెద్దన్న (ఫైల్)

అనంతపురం అర్బన్: సీపీఐ (ఎంఎల్) అనంతపురం జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు మల్లీశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు నాగముత్యాలు, ఉపేంద్ర, తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్యదర్శి మృతి


ప్రశాంతి (ఫైల్)

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం–2 కార్యదర్శి ప్రశాంతి(28) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్త ఐపార్సుపల్లి గ్రామానికి చెందిన రామలక్ష్మి, అశ్వత్థనారాయణ దంపతులకు ముగ్గురు పిల్లలు కాగా వీరిలో ప్రశాంతి మొదటి కుమార్తె. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన ఆమె వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శిగా తిమ్మాపురం గ్రామ సచివాలయం–2కు కార్యదర్శిగా పోస్టింగ్ దక్కించుకుంది. ఆదివారం కనుమ పండగను పురస్కరించుకుని ఇంట్లోని ట్యాంక్‌కు నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై వెల్లకిలా వెనక్కు పడింది. ఆ సమయంలో తల బలంగా సిమెంట్ తొట్టెకు తగలడంతో తీవ్ర గాయమైంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ భీమేష్, సర్పంచ్‌లు హరినాథ్, రామాంజినేయులు, ఎంపీటీసీలు బసప్ప, భాస్కర్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, నాయకుడు వెంకటేశులు తదితరులు ప్రశాంతి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

జనవాక్కు

రూ.3.36 లక్షలకు పైగా లబ్ధి



గతంలో ఎన్నడూ లేనంతగా సీఎం వైఎస్ జగన్ పాలనలో నాకు రూ.3.36 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫారసు లేకుండానే వసతి దీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, ఇంటి స్థలం తదితర పథకాలతో రూ.3.36,528 లబ్ధి కలిగింది. సీఎం వైఎస్ జగన్ మేలు ఎప్పటికీ మరువలేను. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– పి.ఫాతిమా, ఏలంజి, బొమ్మనహాళ్ మండలం

ఆరోగ్యశ్రీతోనే బతికా



టీడీపీ హయాంలో ఆరోగ్య శ్రీ కార్డు కోసం అనేక సార్లు ప్రయత్నం చేసినా రాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్‌ను ఆరోగ్యశ్రీ కార్డు గురించి అడిగాం. ఆయన ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. ఎలాంటి సిఫార్సు లేకుండానే కార్డు వచ్చింది. ఇంటి దగ్గరికే తెచ్చి ఇచ్చారు. ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డుతో బెంగళూరులో క్యాన్సర్ వ్యాధికి వైద్యం చేయించుకున్నా. రూపాయి ఖర్చు లేకుండా కేవలం ఆరోగ్యశ్రీ కార్డుతోనే క్షేమంగా ఇంటికి వచ్చా. ఈ కార్డుతో మా కుటుంబానికి మొత్తం కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుంది.

– ముల్లా హుసేనీ, ఉంతకల్లు, బొమ్మనహాళ్ మండలం

ఇంటి వద్దకే సంక్షేమం



గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులైన తమకు ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు వచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. నాకు వితంతు పింఛన్ రూ.3,000, నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల పథకంలో రూ.1.8 లక్షల విలువ చేసే ఇల్లు మంజూరు కావడంతో నిర్మించుకున్నా. ఎంబీఏ చదువుతున్న నా కూతురు నందినీకి విద్యా దీవెన, వసతి దీవెన అందుతున్నాయి. 3 ఎకరాల పొలం ఉండటంతో రైతు భరోసా రూ.13,500 చొప్పున ఏటా అందుతోంది. సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు గెలిపించుకోవడం మా అందరి బాధ్యత.

– ముత్యాలక్క, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

మేలు మరువలేను



దేశంలో ఎక్కడా లేని విధంగా ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకుని మేలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టాక వాహన మిత్ర పథకం ప్రారంభించారు. ఏటా రూ.10 వేలు అందించారు. నాలుగేళ్ల పాటు నాకు లబ్ధి కలిగింది. రూ.10 వేలుతో ఆటో రిపేర్ల ఖర్చు బెంగ తప్పింది. సీఎం జగన్ మేలు మరువను. ఆయనకే మా మద్దతు.

– పూజారి నాగేంద్ర, ఆటో డ్రైవర్, కూడేరు

వైభవంగా నాగలమడక ఉత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు బదరీనాథ్


పావగడ: తాలూకాలోని నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ విశేష పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ నిర్మాణకర్త రొద్దం సుబ్బయ్య శెట్టి వంశీకులు రొద్దం సురేంద్ర బాబు, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఆలయం ఎదుట ఉన్న నాగులకట్టపై భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉత్సవాల తొలి రోజే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.

రైళ్లలో ఆకస్మిక తనిఖీలు


బోగీలో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం రైల్వే జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే ప్రతి రైలునూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు జీఆర్‌పీ సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉన్నందున విద్రోహ శక్తులు అక్కడకు చేరుకుని విధ్వంసానికి పూనుకోకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. అనుమానిత ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో దొంగలు చెలరేగకుండా ఈ తనిఖీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. తనిఖీల్లో జీఆర్‌పీ ఎస్ఐ గోపీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండ లాగుడు పోటీలు


బండను లాగుడు పోటలను తిలకిస్తున్న ప్రజలు

రాజంపేట రూరల్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా అన్నమయ్య జిల్లా రాజంపేట ఆకేపాటి ఎస్టేట్‌లో దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు టౌన్‌కు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గోసులవారిపల్లికి చెందిన పామిరెడ్డి వెంకటరమణారెడ్డి వృషభాలు ద్వితీయ స్థానం, మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే ప్రసాద్‌రెడ్డి వృషభాలు తృతీయ స్థానం, పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే సూరారెడ్డి వృషభాలు నాలుగో స్థానం, కమలాపురం మండలం జంగంపల్లికి చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి వృషభాలు ఐదో స్థానం, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు ఆరో స్థానం, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టౌన్ వసంతపేటకు చెందిన ద్వార్శల చంద్రశేఖర్‌రెడ్డి, కల్లూరుకు చెందిన పగడాల నాగేష్ వృషభాలు సంయుక్తంగా ఏడో స్థానం దక్కించుకున్నాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

వలస కూలీ దుర్మరణం

గోరంట్ల: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వలస కూలీ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బిహార్‌కు చెందిన మోహన్‌మిశ్రా(35) కొన్ని రోజుల క్రితం గోరంట్లకు వలస వచ్చి స్థానిక గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో కూలీగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి పొద్దుపోయాక పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై పులేరు నుంచి గోరంట్లకు వస్తుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మోహన్‌మిశ్రా అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన వాహనదారులు రోడ్డుపై పడి ఉన్న మిశ్రా మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం



అశోక్‌నగర్‌లో జరిగిన గోదాదేవి కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు చోట్ల సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బారులుదీరి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అంబటి ఫణిరాజ్, వెంకటకృష్ణారెడ్డి, ప్రవీణ్, అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి పాల్గొన్నారు.

- స్థానిక అరవింద ఆశ్రమ ప్రాంగణంలోని శ్రీకృష్ణాలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో వేదపండితుడు బాలాజీ శర్మ గోదాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఎదురుకోళ్లు, తలంబ్రాలు, మాంగల్యధారణ వంటి వాటి వివరాలను తెలియజేస్తూ సాగిన తంతు ఆకట్టుకుంది. నిర్వాహకులు విజయ్‌సాయి, రాఘవేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంప్రదాయాల ప్రతీక..సంక్రాంతి పండుగ

రాప్తాడు: మండలంలో గ్రామ గ్రామానా భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయమే ప్రజలు భోగి మంటలు వేశారు. ధనుర్మాసానికి దక్షిణాయనానికి ఆఖరు రోజు భోగి. దీంతో గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లల్లో ఉన్న పాత వస్తువులు, తాటాకులు, కొయ్యలు, టైర్లు, చేటలు, పరకలు తెచ్చి భోగి మంటల్లో వేసి చలికాచుకున్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు భోగి మంటలు వేశారు. చిన్నారులు మైదానాల్లో గాలిపటాలు ఎగుర వేశారు. సాయంత్రం ఇళ్లల్లో చిన్నారులకు భోగి పండుగ పేరంటం చేశారు. సోమవారం వేకువజాము నుంచి పండగలో ప్రధాన ఘట్టం మొదలుకానుంది. మంగళవారం కనుమ కావడంతో కొత్త అల్లుళ్లకు మాంసాహార విందులు, బావలను మరదళ్లు ఆటపట్టించడం, ఆటల పోటీలతో పండగ శోభ వెల్లివిరియనుంది. పలు గ్రామాల్లో వివిధ రకాల ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు.

ఉత్సాహంగా భోగి పండుగ

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసుకొని, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇళ్ల లోగిళ్లలో మహిళలు అందమైన ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. వీటితో పాటు ప్రజలు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం చేసుకునే మకర సంక్రాంతి పండుగకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు.



రాప్తాడులో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు



రాప్తాడులో భోగి మంటలు వేసిన దృశ్యం

కమనీయం..గోదాదేవి కల్యాణం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, విష్ణుమూర్తిల కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ అర్చకులు గోదాదేవి, విష్ణుమూర్తిని విశేషపుష్పాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గోదాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా సాగింది. భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ వారు విందును ఏర్పాటు చేశారు.

సంక్రాంతి సంతోషంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే రోజు సంక్రాంతి అని అన్నారు. ఇది రైతుల పండుగని, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేసిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువచేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సేవలందిస్తున్నారన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమాన్ని అందించేలా జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు.

సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక సంక్రాంతి

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని, ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని మేయర్ వసీం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సంక్రాంతి పండుగ తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలియజేసి, నిరుద్యోగులకు శుభవార్తను తెలియజేసిందన్నారు. సీఎం జగనన్న నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. సీఎంగా వైఎస్ జగన్ ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం కురుకుంట, ఉప్పరపల్లి లే అవుట్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇంటి నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోపు వీలైనంత వరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను కూడా పూర్తి స్థాయిలో కల్పిస్తుండడంతో లబ్ధిదారులు ఇళ్లలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయా లేఅవుట్‌లలో ఉన్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివస్తున్న తమకు ఇంటి స్థలాలు కేటాయించి, నిర్మాణం చేపట్టి ఇచ్చేలా చూడడం చాలా సంతోషంగా ఉందని లబ్ధిదారులు ఎమ్మెల్యేతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కురుకుంట లే అవుట్‌లో స్థానికంగా ఉండే లబ్ధిదారురాలికి ఇంటిపై హక్కు పత్రం (హౌసింగ్ ప్రొసీడింగ్స్) ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, తదితర అధికారులు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

రమేష్ నారాయణ సాహిత్య సేవలు స్ఫూర్తిదాయకం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యానికి డాక్టర్ పతికి రమేష్ నారాయణ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. ఇటీవల రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న డాక్టర్ రమేష్ నారాయణను సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి ప్రతినిధులు, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, పండిట్ రియాజుద్దీన్, తోట నాగరాజు, నరసింహులు, సుంకర రమేష్ తదితరులు ఆయన్ను సత్కరించారు. ఆర్ఎఫ్‌రోడ్డులోని త్రినేత్ర కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లా సాహిత్యంలో 60కి పైగా పుస్తకాలు రాసిన పతికి రమేష్ నారాయణను ప్రభుత్వం గుర్తించిందని హర్షం వ్యక్తం చేశారు. ఆయన రచించిన ఎర్రని ఆకాశం, జిల్లా జానపద సాహిత్యంపై రాసిన పరిశోధన గ్రంథాలు ఎంతో అమూల్యమైనవన్నారు. రమేష్ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇదే నెలలో తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారాలు, జీవిత సాఫల్య పురస్కారాలను అందించిన కొన్ని రోజులకే రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డులను ఎంతో మంది సీనియర్, యువ రచయితలకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.



రమేష్ నారాయణను సత్కరిస్తున్న సాహిత్య సంస్థల ప్రతినిధులు

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: పారిశుధ్యం మెరుగునకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. ఆదివారం 50వ డివిజన్ పరిధిలో మేయర్ పర్యటించారు. స్థానికులతో నగర పరిశుభ్రతపై ఆరా తీశారు. మేయర్ మాట్లాడుతూ కొన్ని రోజుల పాటు కార్మికులు విధులకు దూరంగా ఉండడంతో నగరంలో చెత్త తరలింపులో జాప్యం జరిగిందని, రాత్రి వేళలోనూ చెత్తను తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం అధికారులు, కార్మికులతో మేయర్ మాట్లాడారు. రోడ్లపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తీసేయాలని తెలిపారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శేఖర్‌బాబు, సైఫుల్లాబేగ్, తదితరులు ఉన్నారు.



50వ డివిజన్‌లో స్థానిక మహిళతో మాట్లాడుతున్న మేయర్ వసీం

పనుల పరిశీలన: నీరుగంటి వీధి, పాతూరు, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. సెట్‌లో పారిశుధ్య కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచనలు, సలహాలు అందించారు.

ఘనంగా శోభన్‌బాబు జయంతి

అనంతపురం కల్చరల్: స్థానిక కృష్ణకళామందిరంలో అనంతపురం శోభన్‌బాబు సేవా సమితి, ఉపాధ్యాయ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో సినీనటుడు శోభన్ బాబు జయంతి వేడుకలను నిర్వహించారు. పాతపాటలతో శోభన్‌బాబుకు స్వరనీరాజనం అర్పించారు. నిర్వాహకులు బాల మురళీకృష్ణ, రామాంజనేయులు, గౌస్‌పీర్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీదేవి, చంద్రమౌళి, విజయలక్ష్మి, బాలమురళీ ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆస్పత్రులు, ఆశ్రమాలలో అన్నదానం చేశారు.



శోభన్‌బాబు జయంతి సందర్భంగా పాటలు పాడుతున్న గాయనీగాయకులు

సమస్యలపై పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న షేకన్న

అనంతపురం క్రైం: మాజీ సైనికుల సమస్యలపై పోరాడుదామని ఆ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వీకే భవన్‌లో ఏర్పాటు చేసిన మాజీ సైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెటరన్స్ డే, జనవరి 15న ఇండియన్ ఆర్మీడే పురస్కరించుకొని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 76 ఏళ్ల క్రితం ఆంగ్లేయులు భారత సైన్యాన్ని ఫీల్డ్ మార్షల్ కెయమ్ కరియప్పను ఆర్మీ చీఫ్ గా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వీకే రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పెద్దన్న సేవలు మరువలేనివి

అనంతపురం కల్చరల్: సీపీఎం ఎంఎల్ సీనియర్ నాయకుడు కామ్రేడ్ పెద్దన్న మరణం తీరని లోటని ఆయన ఉద్యమ సహచరులు తెలిపారు. ఆయన మృతికి జెట్టీ జైరామ్, ఎస్ఎం బాషా, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, విప్లవ గాయకులు దాసరి ఆదినారాయణ, మహాబోధి సాహిత్య వేదిక అధ్యక్షుడు దాసన్నగారి కృష్ణమూర్తి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలియజేశారు. తరిమెల నాగిరెడ్డితో కలిసి చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. పేద ప్రజలకు నివాస స్థలాలను ఏర్పాటు చేయడంలో, తరిమెల నాగిరెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కళాకారులతో కలిసి ప్రతిసారి నిర్వహించేవారని, ఆయన సేవలను కొనసాగిస్తామన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తదితరులు సీపీఐ ఎంఎల్ నాయకుడు పెద్దన్న భౌతికకాయానికి నివాళులర్పించారు.

వ్యక్తికి గాయాలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గానికి చెందిన హరి రామగిరిలో కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయల్దేరాడు. మార్గంమధ్యలో నసనకోటలో వాహనం అదుపుతప్పి బోల్తా పడ్డాడు. తలకు గాయం కావడం గ్రామస్తులు 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

భగవంతుడిపై విశ్వాసంతోనే ఉత్తమ జీవితం



యేసు కల్వరి ప్రేమ మహోత్సవాల్లో పాల్గొన్న క్రైస్తవులు



వాక్య పరిచర్య చేస్తున్న రెవరెండ్ వీణా పి.జెస్సీ

అనంతపురం కల్చరల్: యేసు పట్ల అచంచలమైన విశ్వాసం ఉన్నవారికి ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని యేసు కల్వరి ప్రేమ పరిచర్య వ్యవస్థాపకుడు రెవరెండ్ జేపీ మధు అన్నారు. మూడు రోజుల ఘనంగా సాగిన యేసు కల్వరి ప్రేమ మహోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. కోయర్ బృందాల భక్తిగీతాలు, ఆటపాటలు కనుల పండువగా జరిగాయి. స్థానిక అరవిందనగర్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ బెనహర్ బాబు ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకల్లో ప్రధాన వక్తలుగా చెన్నై నుంచి వచ్చిన రెవరెండ్ మధు, రెవరెండ్ డాక్టర్ వీణా పి.జెస్సీ క్రీస్తు త్యాగాన్ని పాపులను పరిశుద్ధులుగా మార్చడానికి చేసిన ఘన కార్యాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు, నిర్వాహకులు ప్రీతం కుమార్, సంఘ సభ్యులు సునీల్, శ్యామ్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

IV
సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-1-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	847	72,568
నిఫ్టీ ▲	247	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ			మార్పు
నాస్‌డాక్	14,973	▲	3
డోజోన్స్	37,593	▼	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲	48
డాక్స్	16,705	▲	158
షాంఘై	2,882	▼	5
నికాయ్	35,557	▲	525

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎటిఎం	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎటిఎం	105.01	107.59
€	యూరో	ఎటిఎం	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఎటిఎం	56.74	58.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎటిఎం	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఎటిఎం	61.69	63.49
SAR	సౌదీ రియాల్	క్యాష్	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	క్యాష్	21.59	23.22
¥	చైనా యువాన్	క్యాష్	10.41	23.36



రుణ పడొద్దు!

సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.


బకాయిలు సకాలంలో చెల్లించాలి

- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ

గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్జ్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జూలై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద

క్రెడిట్ స్కోర్‌కు విఘాతం



మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది. నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30–60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650–750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన



ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్‌ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.

రుణం కోసం రుణం...



తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14–15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3–4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.

రుణ గ్రహీత ముందున్న మార్గం



రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.

ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

క్రెడిట్ కార్డు రుణం



క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్ణీత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్ణీత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4–10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

వినియోగ రుణం



కన్జ్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

మిరే నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-1-2024	
విశాఖ	599–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
14-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

అదనపు పన్ను ఆదాకు మార్గం..?

పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– రాకేశ్ వర్మ



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ట పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్–1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్టంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18–70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.

సాక్షి స్టాక్స్

జేకే లక్ష్మీ సిమెంట్ — యాక్సిస్ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 869 టార్గెట్: రూ. 1,000

ఎందుకంటే: అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికకల్లా(ఏప్రిల్–జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.



తేజాస్ నెట్‌వర్క్స్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 టార్గెట్: రూ. 1,050

ఎందుకంటే: పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదలు 2027–28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్దిని పొందే అవకాశముంది. బీఎస్ఎన్ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.

